# వెనుకా ముందూ

"ఇక్కడి మనుషులంతా మంచివాళ్ళు కదా! నీళ్ళ ప్రాయంగా ఖూనీలు చేసుకోవటమే ఆశ్చర్యం! యీ రకం క్రిమినల్ సైకాలజీ యీ ప్రాంతంలోనే యెక్కువగా యెందుకున్నట్లో?"

కడపకు కొత్తగా బదిలీ అయి వచ్చిన యిరిగేషన్ అండ్ పబ్లిక్‌వర్క్సు యింజనీరు క్రిష్ణారావు మాట మధ్యలో యథాలాపంగా ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"మీలాగా తడిగుడ్డతో గొంతులు కోయడం తెలియక! పబ్లిగ్గా మగోళ్ళ మాదిరి చేసేదేదో మాకు తెలుసు. సివిల్ కేసుల నాన్పుడు ప్రాంతం గాళ్ళకు యిది యెట్లా అర్థమవుతుంది?"

—వెంకటరెడ్డి పిడుగులాగ విరుచుక పడ్డాడు.

క్రిష్ణారావు జడుసుకున్నాడు. పెదాల కానించుకుంటున్న విస్కీగ్లాసు కింద పెట్టాడు. ప్లేట్లోంచీ తీసుకోబోతున్న మాంసపు ముక్కల్ని ప్లేట్లోనే పడేశాడు.

తాను వెంకటరెడ్డి లాంటి మర్యాదస్తులను అనలేదు. మరీ ఖూనీకోర్లను అన్నాడు. అదీ ఆ మధ్య పులివెందులలో నడిరోడ్డుమీద పట్టపగలు పబ్లిగ్గా జరిగిన ఖూనీ ప్రస్తావన తమ మధ్య వచ్చిందికాబట్టి అన్నాడు. మామూలుగా అన్నాడు. పార్టీలో వున్నవాళ్ళు తెలిసినవాళ్ళు కాబట్టి అన్నాడు. బసిరెడ్డి తనకు కొత్తే అయినా తన కింద కంట్రాక్టరు. వెంకటరెడ్డి, మాధవ తనతో చదువుకున్నవాళ్ళు. రెండేండ్లు తన రూంమేట్లు. ఆ చనువుకొద్దీ మాట జారాడు. అంతే. అంత మాత్రానికే వెంకటరెడ్డి అసహ్యంగా మాట్లాడాడు. మాధవ, బసిరెడ్డి ఏమనుకోకపోయినా మొదట్నుంచీ అంతే. వెంకటరెడ్డి నోరుతెరిస్తే కంపు. యేమీ మారలేదు. యీ పదిపన్నెండేండ్లుగా !

వెంకటరెడ్డికి యేం జవాబిద్దామా అని క్రిష్ణారావు ఆలోచనలు కూడగట్టుకుంటున్నాడు.

మాధవ నవ్వుతూ కలగచేసుకున్నాడు :

"వొరేయి ! ఉరి తీయడంకంటే యేదోమేరకు యెలక్ట్రిక్యూషన్ మేలైనట్లు, నిలువునా నరుక్కోవడం కంటే తడిగుడ్డతో గొంతులు కోసుకోవడం నాగరికతే. సివిల్ కేసులు నాన్చుడే అయినా, మనుషులన్నా మిగుల్తారు. క్రిమినల్లో అదీ లేదు. క్రిమినల్ లాయరు ఆజన్మాంత జూనియరువు. సివిల్ కేసుల నాగరికత నీకేం తెలుసు ?"

మాధవ మాటలతో వెంకటరెడ్డి మరింత రెచ్చిపోయి, అమ్మనా బూతులకు దిగాడు :

"ఆఁ ఆడబ్బ కక్కుర్తి నాగరికత నాకేం తెలుసు? రేగడిగడ్డ నాకొడుకును. యిక్కడేమన్నా దమ్మిడీకి పడుకునే లంజలూ, డబ్బుకోసం తల్లినయినా తాకట్టుపెట్టే వెధవనాకొడుకులూ వుంటేకద నాకు తెలిసేది."

క్రిష్ణారావుకు కోపం చెలరేగుతోంది. పైగా మైకంలో కోపం తమాయించుకోవడానికి గ్లాసులోని విస్కీ ఖాళీ చేశాడు.

మాధవ వ్యంగ్యంగా వెంకటరెడ్డికి అంటించాడు :

"తొందర లేదురా. మన పుణ్యాన దమ్మిడీకి పడుకునేవాళ్ళు యిక్కడ లేరంటావా? తాగినప్పుడల్లా పిల్లకోసం ఎగబడతావే? రోజూ కాకినాడ నుంచే దిగుమతి చేసుకుంటున్నావా? లేకుంటే తల్లినో, తమ్ముణ్ణో యెవరో వొకర్ని మనం మాత్రం తాకట్టుపెట్టే రోజులు యిప్పటికే రాలేదంటావా? అంతగా రాకపోతే నీ నల్లరేగడిమీద తుంగభద్ర నీళ్ళు పారనీ, నాలుగు పెద్ద ఫ్యాక్టరీలు రానీ – అన్నీ అబద్ధాల బ్రతుకులే, అన్నీ డబ్బుచుట్టు జీవితాలే అని తెలిసి వస్తుంది– వెనకా ముందూ అంతే !"

వెంకటరెడ్డి ఉక్కిరిబిక్కిరయ్యాడు. యేం తిట్టడానికి నోరురాక గబగబా సీసాలోది వంచుకుని సోడాకూడా కలుపుకోకుండా తాగాడు. చర్చ ధోరణిని మార్చాలనే వుద్దేశ్యంతో క్రిష్ణారావు బలవంతపు నవ్వు నవ్వుతూ అన్నాడు :

"వెంకటరెడ్డి యేమీ మారలేదు. లయోలాలో మనం చదువుకునేప్పటిలాగే వున్నాడు."

మాధవ పగలబడి నవ్వుతూ అన్నాడు:

"వెంకటరెడ్డిగాడు మారడమా? ప్రత్యేకాంధ్రోద్యమంలో తెలంగాణా వాళ్ళను బండబూతులు తిట్టాడు. యే ప్రాంతంవాళ్ళు వాడికి ముద్దుకాదు. అవకాశం దొరకాలిగానీ ప్రత్యేక కడప రాష్ట్రం కావాలంటాడు. మంత్రివర్గంలో లేని రాజకీయ నాయకులెంత ప్రమాదమో, వీడిలాంటి ప్రాక్టీసులేని లాయర్లూ అంతే ప్రమాదం దేశానికి."

"మా ప్రమాదం తాత్కాలికమైందేరా. ఎప్పటికైనా అసలు ప్రమాదం నీ లాంటివాళ్ళతోనే."

"మా అసలు ప్రమాదం నిజంగా రావాలేకానీ, మీ బూతు నాగరికతలు మాత్రం తుడుచుకుపోతాయి." మాధవ ఆవేశంగా అన్నాడు.

"ప్లీజ్! యీ చర్చ ఆపడం మేలు. కాస్త కులాసాగా కబుర్లు మాట్లాడుకోవడం మేలు యిలాంటప్పుడు" క్రిష్ణారావు వారించాడు.

యిందాకా సాగుతున్న గొడవలో జోక్యం చేసుకోకుండా, ముఖ్యంగా క్రిష్ణారావు గ్లాసును జాగ్రత్తగా విస్కీతో నింపుతున్న కంట్రాక్టరు బసిరెడ్డి క్రిష్ణారావును సమర్థించాడు. అతని భయం అతనిది, అనుకున్నపని కాక ఖర్చు దండగ అయిపోతుందేమోనని.

"అదేసార్! నేనూ అనేది. కుక్కల్లా కొట్లాడడానికి పార్టీలెందుకు? యీ వెంకటరెడ్డి గాడికి మందు వాసన తగిలితేనే తలకాయ తిరుగుతుంది. నువ్వేమీ అనుకోవద్దుసార్! వీనికి కోర్టులో పనిలేదు. పైగా యీ మధ్య గ్రామపార్టీలో యిరుక్కున్నాడు. తలకాయ చెడిపోయింది. 'నా మాదిరి కంట్రాక్టుల్లో దిగరా భాగమిస్తాను' అని మొత్తుకుంటున్నా వింటేనా? నువ్వు ఇ.ఇ.గా వచ్చినావు. యింకన్నా చూడాల మారతాడేమో! యిది సరే వొక్క పుల్లు బాటలుంది. సరుకు యెంతయినా సరే. యింకా స్పెషల్లన్నీ అయిపోలా. వొరె వెంకటరెడ్డీ! నువ్వు మాత్రం కాస్త తక్కువగా తాగరా నాయనా! తాగితే మనుషు లెవరవరయిందీ కూడా మరచిపోతావు."

"మన బసిరెడ్డి యెంత తాగినా మనుషు లెవరయిందీ మరచిపోడు. అవసరాలూ మరచిపోడు", మాధవ కసిగా అన్నాడు.

"వీడున్నాడే మాధవ, వీడు పుస్తకాలు చదివి చెడిపోయిన రకం సార్! యీ యిద్దరో చదువుకునే రోజుల్లో యెట్లా యేగినావో కానీ, వెంకటరెడ్డిగాని నోరు మంచిదికాదు; ఈ మాధవ గాడేమో తెలిసే రెచ్చగొడతాడు."

బసిరెడ్డి మాటలకు క్రిష్ణారావుకు నవ్వు వచ్చింది. 'నువ్వు, నువ్వు' అని సంబోధిస్తున్నందుకు చిరాకు వేసింది. అయితే యిక్కడికి వచ్చిన వారం రోజుల్లోనే కడపలో యెంత చదువుకున్న వాళ్ళయినా చాలామంది 'నువ్వు' అనే సంబోధిస్తారని తెలిసిరావడం వల్ల నవ్వుతూ అన్నాడు :

"కథలు రాసేవాళ్ళు చేసే పని అది. యీ మధ్య యేమైనా కథలు రాశావా! అప్పుడెప్పుడో వొక పుస్తకం పంపావు. పేరు గుర్తుకు రావడం లేదు."

మాధవ సమాధానంగా నవ్వాడు, అంతే.

బసిరెడ్డి కలుపుగోలుగా అన్నాడు:

"వాడి కథలు గుర్తుకు తెచ్చుకుంటే మనం బతకలేం సార్! మనందరి మధ్యా తినీ, తిరిగీ మన కథల్నే గీకుతాడు. యెప్పుడో తన్నులు తిని పోయేవాడు. స్నేహితు డయిపాయె."

మాధవ జుగుప్స ధ్వనించేట్లు అన్నాడు:

"పైగా కులసుడు. వీడి కథలవల్ల మనకేం పోతుంది. వీడి బోడికథలు చదివి, యీ దేశంలో మారే గాడిదకొడు కెవ్వడు అని వూరుకున్నాం అని అనలేదేంరా?"

"వెల్ షెడ్." క్రిష్ణారావు అర్థవంతంగా అన్నాడు. క్రిష్ణారావు వైపుచూచి మాధవ మరి మాట్లాడలేదు.

బసిరెడ్డి ముగ్గులోకి దిగేడు:

"వాడి పుణ్యాన మారకపోతే మనం బతికిపోతాం సార్! ఈ మాధవగాణ్ణి మార్చటం మన తరం కాదు. వెంకటరెడ్డిగాడే నయం. వెంకటరెడ్డిగాడి ఆ తల తిక్కను మార్చాల. లేకపోతే చెడిపోతాడు — దమ్మిడీకి పనికిరాకుండా. వీని కోసమే ఆ దొంగలవాగు బెండరు కూడా వేసింది. నువ్వన్నా చెప్పు. ఆ నల్ల కోటేసుకొని వూరేగడం, కాకుంటే వూర్లోని గొడవల్లో తలకాయ పెట్టి నెత్తికి తెచ్చుకోవడం, లేకుంటే ఆ యునైటెడ్ క్లబ్బులో రమ్మీ ఆడడం. యిదీ వీడి నిర్వాకం. యీ వయసులో కాస్త వెనకేసుకోకుంటే, ఆ తర్వాత రోజుల్లో చిప్ప పట్టుకోవాల్సిందే. భూమిని నమ్ముకొనే రోజులు పోయినాయి."

"నిజమే, నిజమే", క్రిష్ణారావు సాలోచనగా సమ్మతి తెలిపేడు.

భూ సంస్కరణ చట్టాన్ని తప్పించుకోవడానికి తమ కుటుంబం పడుతున్న అవస్థలు గుర్తు కొచ్చాయి. వెంకటరెడ్డి నెమ్మదిగా అన్నాడు :

"ప్రతి వానికి సంపాదించాలనే వుంటుంది. కాని దారి దొరకద్దా? అంతే అందరికీ నీకు మాదిరి డబ్బున్న మామలుండొద్దా?"

మామలే కావాల్నేం? నీకేమయింది? పార్టీలో నాశన మయ్యావు కానీ వందెకరాల భూమి వుంది. ప్రాణమిచ్చే యిలాంటి స్నేహితులున్నారు."

–క్రిష్ణారావు వైపు చూపిస్తూ, బసిరెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతూ అన్నాడు. క్రిష్ణారావు ఖాళీ అయిన గ్లాసు ముందుకు చాపాడు. విస్కీ, సోడా, అయిసుముక్కలో బసిరెడ్డి, క్రిష్ణారావు గ్లాసు నింపాడు.

"యీ కేసు పీడన్నా తెగితే..." వెంకటరెడ్డి మూలిగాడు.

"యేం కేసు?" క్రిష్ణారావు కుతూహలంగా అడిగాడు.

"మామూలే సార్! పనికిమాలిన ఖూనీ కేసు" బసిరెడ్డి సమాధానించాడు.

వివరాలు అడగడానికి క్రిష్ణారావు జంకాడు. బసిరెడ్డే చెప్పాడు:

"వీడు ఖూనీ చేయించాడను కున్నారా సార్? అదేంలేదు. పాపం వీళ్ళ తమ్ముడు ఖూనీ అయినాడు. వూర్లో గొడవలు, యేవో భూమి తకరార్లు."

క్రిష్ణారావు, వెంకటరెడ్డివైపు సానుభూతి పూర్వకంగా చూశాడు. వెంకటరెడ్డి ముఖంలో విచార రేకలు. బసిరెడ్డి కొనసాగించాడు:

"తమ్ముడు పోవడం బాధే సార్! కానీ యీ పగలకు అంతెక్కడ? యెక్కడో ఒకచోట ఆపితే తప్ప ఆగవు, కానీ యెగదోస్తే వాళ్ళతోనే చిక్కు. మా ప్రాంతంలో వొకటుందిలే – కోడిని పందెంలోకి విడిచే వాడికంటె, మెడిమ దొక్కి దమ్ము కొట్టేవాడి హుషారు పెద్దదని. పక్కనోళ్ళు పార్టీ లీడర్ను నిద్ర పోనీరు. వీడి తమ్ముడు పోవడంతో యింటికీ, వూళ్ళో ఒక గ్రూపుకూ వీడే దిక్కు. యింట్లో ఆడవాళ్ళూ, వూర్లో వీడి గ్రూపువాళ్ళూ వూరు చేరమంటారు–కడప విడిచి. పార్టీ నడపమంటారు. మాబోటి వాళ్ళం వద్దని మొత్తుకున్నాం. ఖూనీ కేసు నడుస్తోంది. అయితే యీ లోపల వొక మేలు జరిగింది. అవతల పార్టీవాళ్ళు రాజీ కొస్తున్నారు. వాళ్ళూ కావలసినవాళ్ళే. రాజీకి..."

"లక్ష రూపాయ లిస్తామని వస్తున్నారు," మాధవ మెల్లిగా గొణిగాడు.

"అవును. జరిగిపోయిందేదో జరిగిపోయింది. వెంకటరెడ్డిగాడేమో కక్ష తీర్చుకోవాలంటాడు. దానికి అంతెక్కడ?" బసిరెడ్డి ప్రశ్నించాడు.

"మరి ఆ నా కొడుకును అంతపని చేస్తే గాజులు తొడుక్కొని వూరుకో మంటావా?" వెంకటరెడ్డి ఆవేశంతో వూగిపోయాడు.

"వూరుకోకపోతే జైల్లోనో, వల్లకాట్లోనో తేలాలి," మాధవ నిర్వికారంగా అన్నాడు.

"బసిరెడ్డిగారు చెప్పినట్లు చేసేదే మేలేమో! యెందుకొచ్చిన బాధలు. దొంగల వాగు విషయం చూద్దాం. పనిలో మరచిపోవచ్చు," క్రిష్ణారావు చాలా జాగ్రత్తగా వెంకటరెడ్డి, బసిరెడ్డివైపు చూస్తూ అన్నాడు.

మంచి మాట చెప్పినారు సార్! అవతల వైపువాళ్ళు నాకు బంధువులే. వీడికోసం సాక్ష్యాలన్నీ కట్టుదిట్టం చేసినా. పోలీసోళ్ళవైపు యిబ్బంది లేదు. యింక జడ్జి కోటేశ్వరరావుతో మీరు వొక్కమాట చెప్పితే..." బసిరెడ్డి వల విసిరాడు.

"నాకు దగ్గర బంధువే. విచిత్రమైన మనిషి. చూద్దాం. ప్రయత్నిస్తే దారి దొరక్కపోదు."

మాధవ దగ్గరుండగా యింకా వివరంగా మాట్లాడటం ప్రమాదమని మాధవవైపు క్రిష్ణారావు అనుమానంగా చూశాడు. మాధవ గ్రహించాడు.

తానే పార్టీలో పుడకలాగా తయారయ్యాడు. తన తత్వమే అంత. యిటు వంటి ప్రపంచంలో యిమడలేడు. అట్లని యీ ప్రపంచంలోకి రాకుండానూ వుండలేడు. 'నువ్వూ, వెంకటరెడ్డి ఇ. ఇ. కి స్నేహితులు. ఇ. ఇ. కలుగజేసుకుంటే వెంకటరెడ్డిగాడు బయటపడతాడు. పార్టీకి పిలవండి. పార్టీఖర్చు నాది. స్నేహితం కోసం యీ పని చేద్దాం' అని బసిరెడ్డి అంటే...జరిగిందిది.

మాధవకు తనమీద తనకు అసహ్యమేసింది. మిగతా ముగ్గురిమీద జుగుప్స కలిగింది. మందు కొచ్చింది. నిర్దయగా చెణికాడు :

"పనులన్నీ అయిపోయినాయి. యిప్పుడు చెప్పరా — వోరే కడప విక్రమార్కా! రెగడిగడ్డ వీరా! వెంకటరెడ్డిగా! యీ పార్టీ బసిరెడ్డిగాడు యేర్పాటు చేయడానికి యెందుకు ముందుకొచ్చినట్లు? నీ కోసమేనా? యీ క్రిష్ణారావెందుకు వొప్పుకున్నట్లు? పంద్రేండ్లనాటి మన స్నేహం కోసమేనా? నువ్వెందుకు కలిసినట్లు? మీ వూరి బాగుకోసమేనా? నేనెందుకు వచ్చినట్లు? కథలు రాయడానికేనా? జవాబు చెప్పరా? చెపితే మనం గర్వపడే నాగరికతలన్నీ అర్థమవుతాయి. చెప్పరా?"

వెంకటరెడ్డి బండతిట్లకు లంకించుకున్నాడు. కొట్టడానికి ముందుకు వచ్చాడు. "గెటవుట్" అని అరిచాడు.

మాధవగారూ, ప్లీజ్ లీవ్ అజ్," క్రిష్ణారావు సమర్థించాడు.

"నువ్వెళ్ళరా," బసిరెడ్డి మందలింపుగా అన్నాడు.

కోపంతో, జుగుప్సతో, స్వకరుణతో మాధవ బయటికి వెళ్ళిపోయాడు.

"వొఠి జెలసీ ఫెలో. యిన్నాళ్ళూ కవిగాళ్ళూ, ముండలూ పార్టీల్లో యెంటర్‌టెయిన్ చేసేవాళ్ళే అనుకున్నాను. ఛీ ఛీ మనసంతా కంగాళీ చేసి పోయాడు," క్రిష్ణారావు నాగరికంగా మాధవను తిట్టాడు.

వాళ్ళు ముగ్గురూ తాగటంలో నిమగ్నమయ్యారు.

బసిరెడ్డి కైపెక్కిపోతున్న కళ్ళకు దొంగలవాగు కంట్రాక్టూ, వెంకటరెడ్డి పార్టీ రాజీవల్ల చేసుకొనబోయే డబ్బూ కన్పిస్తున్నాయి.

క్రిష్ణారావు తిమ్మిరెక్కిపోతున్న మనసులో దొంగలవాగు కంట్రాక్టూ, వెంకటరెడ్డి ఖూనీకేసు వల్ల తగిలే కమీషనూ అంకెలు కూడుకుంటున్నాయి.

వెంకటరెడ్డి జివ్వుమంటూన్న చెవుల్లో హోరు: ఖూనీ అయిన తమ్ముడూ, రాజీతో రాలే లక్ష రూపాయల గలగల చప్పుళ్ళూ, తల్లీ మరదళ్ళ కేకలూ, యేడ్పులూ. ముందే బసిరెడ్డి యేర్పాటు చేసిన ఆడదాని సుఖం కోసం లాగుతున్న నరాలు మరొక వైపు, తామిచ్చే డబ్బుకోసం రాకతప్పని ఆడదాని కోసం...

మధ్య మధ్య యెంత దూరం చేసుకుందామనుకున్నా ముగ్గురినీ కలత పెడుతున్న మాధవ భేతాళ ప్రశ్నలు...

ప్రమాద భావాలు...

○ మార్చి 1977, యువజన మాసపత్రిక.